# చదువుకున్న వాడికన్న సైకిల్ మేలు

— జ్యేష్ఠ

## నేను లెక్చరర్‌గా పనిచేస్తున్న సైన్సు యూనివర్సిటీని సెప్టెంబర్ ఆరునుంచి నిరవధికంగా మూసి వేశారు. మూసివేశారు అనే క్రియకి కర్త వుండాలికదా అని మీరు ప్రశ్నిస్తే నావద్ద దానికి జవాబు లేదు.

అది నా తప్పుకాదు.

ఒక్కటి మాత్రం చెప్పగలను. ఇది సైన్సుయుగం కనుక జీవితంలో అన్ని రంగాలలోనూ సైన్సు పెరిగిపోతోంది. కనుక మాది 'సైన్సు యూనివర్శిటీ' కనుక సహజంగానే అది కులతత్వం, కులరాజకీయాలు మొదలైన కులకులలలో భారతదేశంలోనేకాదు ప్రపంచంలోనే అగ్రస్థానానికి చేరింది— స్థాపించి పట్టుమని ఏడేళ్ళుకూడా కాకుండానే, విద్యార్థి సంఘాల ఎన్నికలు జరిగిన రోజున కెమిస్ట్రీ లేబొరెటరీలోంచి రెండు రెండున్నర లీటర్ల నైట్రిక్ ఏసిడ్ సీసాలు-ఇంకా సీలు విప్పనివి-మాయమయ్యాయి. అది తెలిసి కెమిస్ట్రీ లాబ్‌లో కలకలం మొదలైంది.

సాయంత్రానికల్లా సెలవులిచ్చేస్తున్నట్టు నోటీసులు వచ్చేశాయి. మేం వెళ్ళి ప్రిన్సిపాల్‌ని అడిగితే నీటిచుక్కమీదపడిన గంధకికామ్లంలా ఎగిరిపడ్డాడు. 'నాకేమీ తెలీదు. నా కుల సంఘం నుంచి ఈ విషయంలో నాకే విధమైన ఆదేశమూ రాలేదు. సెలవు నోటీసు వచ్చిందా? ...నాకు టైప్ రైటింగ్ రాదుగా... టైపిస్టుని అడిగి చూడండి. ఆ? నాకు సంతకం పెట్టడం వచ్చునంటారా? హహ్హహ్హ! థేంక్స్ ఫర్ ది కాన్‌ఫిడెన్స్ ఇన్ మి... నేను నిశాని దొరునని, అయినా సైన్స్ యూనివర్సిటీ మొదటి ప్రిన్సిపాల్ అయ్యానని ఆరోపిస్తూ— కులసంఘంవాళ్ళు కరపత్రం వేశారు. చూస్తారా?' అని కోటు జేబులోంచి ఓ బొత్తి తీసి మాకు తలకొకక కాపీ చొప్పున ఇచ్చి మళ్ళీ ఏమనుకున్నాడో... రెండేసి అదనంగా ఇచ్చాడాయన. మేం ఆత్రుతగా చదవసాగాం. ఆయన కాఫీ తెప్పిస్తానని ముచ్చట పడ్డవాడే మళ్ళీ వెనుకంజ వేశాడు "కేంటిన్ వాడు"—"కులం" మనిషి. మన పేరు చెబితే కాఫీ అని ఫ్లాస్కులో సజల గంధకి కామ్లం పోసి రంగొచ్చేలా కాఫీపొడి కల్తీచేసి పంపినా పంపచ్చు. ఎలాగూ ఊళ్ళోకి పోతున్నారుగా ఇళ్ళలోనే తాగండి. బోన్ వో యేజ్ మై డియర్ కొలీగ్స్ అండ్ సైంటిస్ట్సు! అన్నాడు మరో కులానికి చెందిన ఒక ప్రొఫెసర్ గొంతుతో

మేం ఇవతలికి వచ్చేశాం. జియాలజీ లెక్చరర్ ప్రభాకర్ "మనవాడు వూరికెనే అయ్యాడా ప్రిన్సిపాల్! ఎంత హిపోక్రసీ! ఎంత మాయ నాటకం! ఇందాక ఆ గొంతక విన్నారా? తన గొంతుక కానేకాదు. ఇమిటేషన్! రేపు ఎవరైనా అడిగితే 'నేనేమీ అనందే. అది నా గొంతుక అయితేకదా' అని తప్పించు కుంటాడు." అని విమర్శించ సాగాడు. ప్రభాకర్ అతని కులసంఘంలో పేరు పడిన వక్త. ఎమ్మెస్సీలో గోల్డ్ మెడలిస్టు. మా అందరిలాగే అతనూ కులబలంతోనే సై.యూ.లో లెక్చరర్ అయ్యాడు. క్లాసులో అతను మితభాషి. కాని బయట కులతత్వం మీద నిప్పులు కురిపిస్తూ, గిరీశాన్ని మించిపోయే లెక్చరర్.

ప్రభాకర్ వాగ్ధాటినుంచి ఎలా బయటపడాలా అని నేను మెలికలు తిరుగుతూ ఆలోచిస్తుండగా దూరాన పోస్ట్‌మన్ కనిపించాడు. నేను ఆ వంకని అటు పరుగెత్తాను. పోస్ట్‌మన్ ఓ కవరు అందించాడు. దస్తూరి చూస్తూనే పోల్చుకున్నాను. సుజాత, అంటే నా కాబోయే అర్ధాంగి, రాసిందాలేఖ. అంత ఉపకారం చేసిన ఆ పోస్ట్‌మన్ హంసకి కేవలం ఒక రూపాయే కానుక ఇచ్చి, మేఘాల మీద నడుస్తూ కవరు చింపాను.

నా మేఘ యాత్ర కొద్ది క్షణాలు మాత్రమే సాగింది. ఉత్తరం చదువుతూనే నీరుకారి పోయాను. ఒక్క కుదుపుతో మేఘాలనుంచి జారి రోడ్డుమీద పడి ఏనాడూ వెలగని ఓ దీపస్తంభాన్ని ఢీ కొట్టాను. ఎందుకంటే, సుజాత ఇలా రాసింది—

"బావా, నువ్వు నా ప్రాణానివి. నా దైవానివి. నా మీద కోప్పడనంటే ఓ సంగతి చెబుతాను. నాన్న చెప్పమన్నాడు. మేనరికాలు మంచివి కావుట. సైన్సు రీసెర్చిలో తెలిసిందిట. నాన్న చెప్పమన్నాడు. అంచేత మనకు పెళ్ళి జరుగదు. నాన్న అలాగని చెప్పాక నూతిలోకి దూకుదామనిపించింది. కాని నూతిలో మరణించడం శాస్త్రీయ దృక్పథం కాదు. ఎందుకంటే ఇక్కడ అస్సలు వర్షాలు లేవు. పొలాలు ఎండిపోయాయి. నూతుల్లో నీళ్ళు అడుక్కి వెళ్ళిపోయాయి. బావా నీకు హోటల్ తిండి పడదు. మగ మహారాజువి సైన్సు యూనివర్శిటీ లెక్చరర్‌వి నీకేం లోటు. అంచేత వెంటనే ఎవరో అమ్మాయిని పెళ్ళి చేసుకో..."ఇలా ఎక్సర్‌సైజ్ బుక్‌లోంచి చింపిన ఏడు పావుతావు కాగితాలు రాసింది.

ఓ పేజి చదివేసరికి బుర్ర తిరిగిపోయింది నాకు. దాన్ని తిరగనిస్తూనే, ఎలక్ట్రిక్ పోల్ చుట్టూ తిరుగుతూ మిగతా ఉత్తరం పూర్తి చేశాను. నిరాశతో కల్‌వర్ట్‌మీద కూచుని వుండగా బయాలజీ లెక్చరర్ శివానంద్ ఆ దారినే వస్తూ నన్నుచూసి ఆగి, పలుకరించి నా ప్రక్కనే కూర్చున్నాడు. మా ఇద్దరి కులం ఒకటేనని మీరు గ్రహించే వుంటారు— ఏ మాత్రం కుల శాస్త్రీయ దృక్పథం వున్నా.

"కళ్ళల్లో ఆ కన్నీరేమిటోయ్?"

"కన్నీళ్ళా? లేవే... ఓ, ఇవా! ఇవి కన్నీళ్ళని నువ్వేశాస్త్రాధారంతో చెప్తున్నావు?"

"నేను బయాలజీ చదివినవాణ్ణి, మూడు నెలల్లో చెయ్యాల్సిన పి.హెచ్.డి.కి పదేళ్ళు శ్రమించిన వాణ్ణి అని గుర్తుచేసుకో ఫిజిక్స్ గబ్బిలాయ్! బయాలజీ వాణ్ణి కనుకనే కన్నీటిని పోల్చేశాను". అని తన జోక్‌కి తనే నవ్వేశాడువాడు. నేనూ తాత్కాలికంగా సుజాత ముద్దు

మాటలతో పంపించిన దుఃఖాన్ని మరచిపోయి, కూడా నవ్వేశాను.

నవ్వడం పూర్తయ్యాక నా మోహం వేపు ప్రశ్నార్థకంగా చూశాడు శివానంద్. గుండె గొంతుకలో కొట్లాడు తోందేమో, నాకు సుజాత సందేశాన్ని నోటితో పలికే శక్తి చాలలేదు. అది రాసిన ఉత్తరాన్ని మాట్లాడకుండా వాడిచేతిలో పెట్టి, మళ్ళీ మనసారా ఏడవడం మొదలెట్టాను (మనస్సులో).

ఇరవై నిముషాలు. సుజాత ఉత్తరాన్ని చదవడానికి అంత టైం పట్టింది శివానంద్‌కి. ఉత్తరాన్ని జాగ్రత్తగా కవరులో పెట్టి నాకందిస్తూ, "నీ సుజాత చాలా గంభీరమైన పిల్లోయ్. కవి హృదయం ఓ పట్టాన అర్థం కాలేదునాకు. నువ్వంటే ఎంత ప్రేమ! ఎంత ప్రేమ!! మీ మామయ్య చూస్తే సైన్స్ మూర్ఖుడిలా వున్నాడు, మన సైన్స్ యూనివర్శిటీలో అందరూ కులతత్వ మూర్ఖులయినట్టు!—... సుజాత వరసచూస్తే అతను రోజా సైన్స్ జపంచేసి ఆ పిల్ల మీద ప్రయోగిస్తు న్నట్టుంది. మేనరికాల మీద రీసెర్చి జరిగింది. నిజమే—" అంటూ పకపకా నవ్వసాగాడు వాడు.

అలా నవ్వుతూ వుండి పోయిన శివానంద్‌ను చూస్తుంటే తన్నాలనిపిస్తోంది. వాడి బుజం పట్టుకుని కుదుపుతూ —"నోరు మూసుకుని ఆ మేనరికాల రిసెర్చి గురించి ముందు చెప్పరా" అన్నాను. ఆ రిసెర్చి ఏం చెబుతుందోనని భయంతో నాగొంతు ఎండి పోయింది.

శివానంద్ మళ్ళీ నవ్వు మొదలెట్టాడు. "హహ్హహ్హ, హహహహహ్హ, హహహహో..." అంటూ రకరకాల తాళాలతో రకరకాల శృతుల్లో నవ్వుతున్నాడు. సంగీతం వచ్చిన గొప్ప కాబోలు వెధవకి.

వాడెంత సేపటికీ నవ్వాపక అదో శాస్త్రీయ సంగీత కచేరీలా జిడ్డుగా కొనసాగిస్తుంటే, వాడి నెత్తిమీద తాళం వేయడం మొదలెట్టాను. దెబ్బకి దయ్యం జడుస్తుంది, నవ్వు తగ్గించాడు!

"కొట్టకు కొట్టకు, అంతా చెప్పేస్తా, ఇంకొక్క నిమిషం నవ్వేసి' అని శివానంద్ ఏడుపు గొంతుతో నవ్వు పూర్తిచేశాడు. నిమిషంకాగానే నవ్వుబుద్ధిగా ఆపేసి "అనలా ప్రొఫెసర్ వెంకట్రావు లేడూ... అదే ఆ... కులంవాడు. బుద్ధిలేదని వేరే చెప్పక్కర్లేదుగా. వాడి తాత మె కాలేగారి బూటు నాకి దాంతో పదునెక్కిన నాలుకతో ఇంగ్లీషులో బూతు కవిత్వం చెప్పి రావు బహదూర్ బిరుదు పొందాడు.తండ్రి— స్వాతంత్ర్య పోరాటం రోజుల్లో — కాంగ్రెస్ మీటింగ్‌ల మీద విసరడానికి ఊరూరా రాళ్ళు సప్లై చేసే కాంట్రాక్ట్ తీసుకుని లక్షాధికారి అయ్యాడు. బ్రిటిష్ వాళ్ళు కల్చరు, సైన్సు పేరుతో మన సంప్రదాయన్ని దెబ్బకొట్టారు... వెంకట్రావుగాడి రూంకి నువ్వెప్పుడైనా వెళ్ళావా వాడు రిటైర్ కాకముందు.?...."

"వెళ్ళాను. అయిదుసార్లు"

"ఆ గదిలో కుళ్ళు కంపు గుర్తుందా"

"ఊ... ఎలక చచ్చిన వాసన..."

"ఎలకా కాదు. పిల్లీకాదు. వాడి సాక్స్ వాసన! దొరలు వాళ్ళది చలిదేశం కనుక బూటు, సూటు, టై, హ్యాటు వేసుకుంటారుకదా. ఈ ఉష్ణదేశపు మేధావికి ఆ రహస్యం తడితేగా! మంచి సమ్మర్‌లోకూడ బూటు వేసేవాడు. సాక్స్ కొనడానికి మళ్ళీ పీనాసి తనం.



ఒక్కటే జత వుండేది. దాన్ని ఏడాదికోసారి ఉతికేవాడు. కాలేజికి వచ్చి ఆ బూట్లు విప్పగానే చెమట తోలూ కలిసి ఎలక చచ్చిన కంపులా గుబాళించేది."

"అందుకే వాడి మేనరికాల రీసెర్చికూడా అలాంటి కంపే కొడుతుంది. కాని ఏమైందో తెలుసా?." అని పగలబడి నవ్వసాగాడు శివానంద్.

"ఒరే నీ వెధవ నవ్వు చూస్తుంటే ఆ వెంకట్రావు ఘోరో కులం వాడైనా నీ కంటే లక్షరెట్లు గొప్పవాడనిపిస్తోంది. నవ్వాపుతావా చంపేయ్యనా?" అన్నాను.

శివానంద్ నవ్వు తగ్గించి "వెంకట్రావుగాడు పాపం మెకాలే ఆత్మశాంతి కోసం ఈ బోడి రీసెర్చి చేసి మేనరికాలవల్ల ఆ జంటలకి పుట్టబోయే పిల్లల్లో అవలక్షణాలు ఎక్కువని రుజువు చేశాడో లేదో అతగాడి పెద్దల్లుడు కామరాజు పెళ్ళాంతో సహా దిగిపోయాడు. అది మేనరికంలే. అంచేత అతను "మావయ్యా నీ కూతుర్ని వదిలేస్తున్నాను. మేనరికాలవల్ల అనర్థాలు ఎక్కువని నువ్వు రీసెర్చిలో రుజువు చేశావుటగా.

అనేశాడు. వెంకట్రావు అప్పటికి మిగిలి వున్న కాస్త జుట్టూకూడా పీకేసుకుని అప్పుడే తిరుపతి క్షవరం పొందిన వాడిలా భాసించాడు. శీతాకాలం కేవలం బనీనూ లుంగీ ధరించి లండన్ హీత్‌రో ఎయిర్ పోర్టులో దిగిన సహారా వాస్తవ్యుడిలా వణికి పోయాడు!"

"వెంకట్రావు అల్లుణ్ణి గెడ్డం పట్టుకుని బతిమాలాడు. తన రీసెర్చిని నమ్మవద్దని, తనది బోడి రీసెర్చని దానికి రుజువు తన బోడి బుర్రేనని వాదించాడు. మతాధికారులకి భయపడి గెలీలియో భూమి సూర్యుడి చుట్టూ తిరగడం లేదని చెప్పి లెంపలేసుకున్న సత్సంప్రదాయాన్నే వెంకట్రావూ ఫాలో అయ్యాడు. తప్పులు చేయడం మానవ సహజమనీ, తన రీసెర్చికూడా అలా జరిగిందేననీ చెప్పి వెక్కి వెక్కి ఏడ్చాడు."

మామ గారి ఏడుపే కదా అల్లుళ్ళ పరమావధి! వెంకట్రావు అలా ఏడుస్తుంటే అల్లుడు పొంగిపోయాడు.

"మావయ్య నీ మేనరికాల రీసెర్చిని ప్రథమ తప్పుగా క్షమించేశాను. ఏడవకు. తెలుగు నవలా రచయిత్రి ఒకరు చెప్పినట్లు మౌనంగా కూడా రోదించకు. కాని సైన్సంటే నాకు అపారమైన గౌరవం. హిందూ, ముస్లిం, కిరస్తానీ మతాల్లాగే సైన్సు కూడా గౌరవిస్తాను. నాకు అన్ని మతాలు ఇష్టమే. కాని మేనరికాల వల్ల కన్నొంకరో కాలొంకరో వున్న పిల్లలు పుడతారని నీ రీసెర్చి తేల్చి చెప్పిందిగా! అన్నట్టు మావయ్యా! నీకు ప్రొబబిలిటీ థియరీలో సున్నా వచ్చిందిటగా అమెరికాలో చదివినప్పుడు! ప్రొబబిలిటీ తెలీని వాడివి కనక నీది కల్తీలేని చెత్త రీసెర్చే కాదనను. అయినా నా మనస్సు పీకుతోంది, నాకూరమకీ ఎలాంటి వికలాంగులు పుడతారోనని. అంచేత విడాకులివ్వను కాని వేసక్టమీ చేయించుకుంటాను. నీ రీసెర్చికి నేనిచ్చే ప్రేమ కానుక అదే మావయ్యా" అన్నాడు.

"వెంకట్రావు హృదయం లేని వాడు కనుక సరిపోయింది. లేకపోతే గుండె ఆగి అక్కడే చచ్చి పోయుండేవాడు. "ఒరే ఒరే కాముడూ, తొందరపడి నా రీసెర్చిని నమ్మకురా. తొందరపడి ఏ పనీ చేయరాదు. లుక్ బిఫోర్ యూ లీప్. పాముని చంపి ఉయ్యాల్లో పిల్లాడిని కాపాడిన ముంగిసనే చంపేసిన వాడి కథ తెలుసు కదా. నీకు ముగ్గురు పిల్లలు పుట్టేక వేసక్టమీతో బాటు ట్యూబెక్టమీ కూడా చెయిస్తానీకు. అప్పటి దాకా ఆగు" అని అల్లుడిని బతిమాలాడు.

"మామకు తగ్గ అల్లుడు కామరాజు. వెంకట్రావు ఎంత దొంగ సైంటిస్టో అల్లుడు అంత డబ్బు పిచ్చాడు. "మావయ్యా స్కూటర్ కొనమని తిరుపతి వెంకన్న ఈ మధ్య రోజూ కలలో కనపడి చెప్తున్నాడు. బ్లాక్‌లో పదమూడువేలే. తిరుపతి గుండుతో కలిపి పద్నాలుగు వేలు. మీ అమ్మాయి కూడా తలనీలా లిస్తుందిట నేను స్కూటర్ మీద తిప్పుతానంటే..." అని నసిగాడు.

ఈసారి నవ్వడం నా వంతైంది."నిజంగా మేనరికాల వల్ల ప్రమాదం లేదన్నమాట" అన్నాను.

"ఓరి చవటా! ప్రమాదం వుంటే కొన్ని రకాల వివాహాలను నిషేధించిన పూర్వులు ఇదీ నిషేధించేవారు కదురా. వెంకట్రావు గాడు ప్రమోషన్ కోసం ఏదో ఓ రీసెర్చి చేయించాడు కాని వాడు దాన్ని నమ్మేడా ఏమన్నానా. కాని చేసిన పాపం ఊరికే పోతుందా.??"

"ఏం ఏమైంది"

"ఇంకేం కావాలి. వెంకట్రావు పెద్దల్లుడు - అదే కామరాజు గాడు - ఏటేటా పది వేలు పాతిక వేలు గుంజుతున్నాడు ఈ వంకని. 'ఇవ్వకపోతే వేసక్టమీ'

శీతాకాలం కేవలం బనీనూ
లుంగీ ధరించి లండన్
హీత్ రో విమానాశ్రయంలో
దిగిన సహారా వాస్తవ్యుడిలా
వణికిపోయాడు.

అంటూ దుర్మార్గుడు! ఇద్దరు బంగారబొమ్మల్లాంటి పిల్లల్ని కన్నాడు. ఐనా మరో ఛాన్సుందిగా. అంచేత మూడో కానుపు జాగ్రత్తగా ఆలస్యం చేస్తూ మామగార్ని విలువు దోపిడీ చేసేస్తున్నాడు, మేనరికం - నష్టాలు అవి దరువు పాడుతూ! ఎవరి పాపం వారినే కొడుతుందోయ్ గుర్నాధం" అన్నాడు శివానంద్.

"పాపం వెంకట్రావ్ ది పూర్! ఈ దేశంలో సైంటిస్టుల గతి ఇంతేనా? ఈ ట్వెంటీయత్ సెంచరీలో, రాకెట్ యుగంలో వెంకట్రావు లాంటి గొప్ప పరిశోధకులు ఇలా క్రూర అల్లుళ్ళ దురంతానికి తల ఒగ్గ వలసిందేనా? దీనికి హద్దులు లేవా" అని నిట్టూర్చాను.

"నువ్వూరికే బాధపడకురా. ఇవి పెద్దవాళ్ళకి రోజులు కావు. జీవితమే అంత" అని తోడుగా నిట్టూర్చాడు శివానంద్.

" - మా మావయ్యకి సైన్సు అస్సలూ తెలీదు. అంచేత శాస్త్రీయ దృక్పథం ఎక్కువ. మేనరికాల వల్ల చాలా అపకారం వుందంటూ ఎవరో అణా కానీ వ్యాసం రాస్తే చదివి సుజాతని నాకివ్వనంటున్నాడు. ఏం చేద్దాం?" అన్నాను సుజాత వుత్తరం నా గుండెల్లోకి గుచ్చుకుని గుర్తు చేయడంతో.

"అదా! కామరాజు గారికి సకుటుంబంగా మీ మావయ్య దగ్గరకు తీసుకెళ్ళు. అదే చాలు అతన్ని ఒప్పించడానికి?" అన్నాడు శివానంద్.

నేను నిర్ఘాంత పోయాను. శివానంద్‌కి పిచ్చెత్తిందా? ఎంత మాటన్నాడు!

నాకు ఎంత ప్రయత్నించినా నోట మాట రావడం లేదు. అయిదునిషాలు అందరు దేవుళ్ళనీ ప్రార్థించాక మాటొచ్చింది. "ఒరే నువ్వు మతి వుండే ఈ మాట న్నావా!" అన్నాను హీన స్వరంతో

"ఏం? కామరాజుకి పనస పళ్ళ లాంటి పిల్లలు పుట్టారని స్వయంగా చూశాకా కూడా మీ మామయ్య మారడా? మారతాడనే నా నమ్మకం. అది చాలదం టావా? వెంకట్రావుని కూడా రమ్మందామా?"

"ఒరే ఒరే నువ్వు వేలవిడిచి సాము చేస్తున్నావురా. యూ ఆర్ బార్కింగ్ ఎట్ ది రాంగ్ ట్రీ! నీకు బుద్ధుందిరా?"

శివానంద్ పశ్చాత్తాపంతో వెక్కి వెక్కి రోదించ సాగాడు. నేను కూడా ఏడిచాను. శివానంద్ తన తలబాదుకుంటూ, మధ్య మధ్య నా తల కూడా బాదుతూ "నాకు నిష్కృతి లేదురా అనంతం, నాకు

> ఓం కులానంద,
> కులరూప, కులజ్యోతి,
> కులహంస కుళ్లు
> గుమ్మడికాయా ఓం
> కుల నిష్ఠా గరిష్ఠ కులహారే!

నిష్కృతి లేదు. మన కులత ఏమిటో మరిచిపోయినే వా జన్మా ఒక జన్మేనా! ఈ సైన్స్ యూనివర్సిటీలో లెక్చెరర్‌గా వుండే అర్హత నాకు లేదురా, నాకు లేదు... ఓరీ శివానందూ నువ్వు పశువ్విరా! కులద్రోహివిరా" అన్నాడు ఉద్రేకంగా.

నాకు ఆనందంతో ఒళ్ళు పులకించింది. "ఒరే శివా బాధపడకు. ఆ వెంకట్రావు మేనరికాల రీసెర్చిలాగానే నువ్వు పొరపాటున ఇలా మాట్లాడావు. తప్పులు దిద్దు కోవడంలోనే ఘనత! నేను కామరాజు హెల్ప్ వచ్చినా అడగను! సుజాత నాకు దక్కకపోయినా సరే. సుజాత ఇంకెవర్నో పెళ్ళాడి హాయిగా జీవించి పండంటి పిల్లల్ని కంటే అదే చాలు" అన్నాడు.

"కులం కోసం ప్రేమని కూడా త్యాగం చేసిన మహా వీరుడిగా నీ పేరు చరిత్రలో నిలిచి పోతుంది బ్రదర్" అని రకరకాలుగా నన్ను మెచ్చుకున్నాడు శివానంద్.

అది మరపురాని మధురాను భవం.

కాని ఏది శాశ్వతం!




నేనూ, శివానందూ మా కులాన్ని మెచ్చుకుంటూ ఇతర కులాల్ని తిడుతూ ఓ డ్యూయట్ లా మాట్లాడ్డం పావుగంటసేపు జరిగిందో లేదో ఇద్దరు స్టూడెంట్స్ మా వేపు వస్తూ కనిపించారు.

మేస్టర్లు స్టూడెంట్సంటే భయపడ్డం సహజమే కదా. ఇద్దరం నోళ్ళకి తాళాలేసేసుకుని గంభీరంగా కూర్చు న్నాం పెద్ద మనుషుల్లా. ఆశారావు, కుచేలరావు(ఆ విద్యార్థులు) మాకు దగ్గరయ్యే కొద్దీ మా భయం పెరగ సాగింది. వాళ్ళిద్దరి చేతుల్లోనూ ఏసిడ్ సీసాలు.

వాళ్ళూ మా కులం వాళ్ళే!

అయినా భయంగానే వుంది మాట.

వాళ్ళు మా దగ్గరకేవచ్చి సిగరెట్లు అడిగి, నమ్మల్నే వెలిగించమని, ఠీవిగా కాల్చసాగారు.

"కూర్చోడం కుదరదు మేష్టారూ. అర్జంటు పనుంది" అంటూ ఏసిడ్ సీసాలని మరో భుజం మీదకి మార్చుకుని వాళ్ళు వెళ్ళిపోయారు.

"ఎవరిమీద పోస్తారంటావ్?" వాళ్ళు వినలేరని

> మన కులం కాని మనిషి,
> మన పేరు చెపితే కాఫీఫ్లాస్క్‌లో
> సజల గంధకి కామ్లం పోసి
> రంగొచ్చేలా కాఫీపొడి
> కల్తీచేసి పంపినా పంపొచ్చు.

నమ్మకం కుదిరాక అడిగాను.

"ఇంకెవరి మీద? ఎలక్షన్‌లో గెలిచిన వాళ్ళ మీద. అందుకే కదా లాబ్ లోంచి ఎత్తుకుపోయింది!" అన్నాడు శివానంద్

నేను ప్రాణాలకు తెగించి పరుగెత్తాను. ఆ విదార్థుల వేపు... రొప్పుతూ వాళ్ళని చేరి "ఆశారావు, కుచేల రావూ! తొందరపడకండి. ఇక్కడ పోలీసు ఆఫీసర్లు మనవాళ్ళు కారు. అంచేత మీరు ఏసిడ్ ఎవరి మీదేనా జల్లితే మీకు పోలీసు రక్షణ వుండదు" అని హెచ్చరించాను.

వాళ్ళిద్దరూనా మాటకి నీసమెత్తు విలువ కూడా ఇవ్వలేదు సరికదా హేళనగా నవ్వారు. "మేష్టారూ మీ కేస్ట్ ఫీలింగ్ లెవెల్ దగ్గర ఆగిపోయారు. దాని కంటే గొప్పది మరోటుంది. అదే ట్రూత్ ఫీలింగ్. అది కులాలకి అతీతం లెండి" అని వెక్కిరించి వేగంగా వెళ్ళిపోయారు.

కాళ్ళీడ్చుకుంటూ వెనక్కి వస్తున్న నా వేపు ఆత్రుతగా ఎదురొచ్చిన శివానంద్ "ఏమంటున్నారు. ఏసిడ్ ఎవరి మీద పోస్తారుట?" అని అడిగాడు. వాడికి వార్ పిక్చర్స్, క్రైమ్ థ్రిల్లర్స్ చాలా ఇష్టం.

"చెప్తారేమిటి రాస్కెల్స్? స్టూడెంట్స్‌కి మేష్టర్లంటే గౌరవం నశిస్తోంది. గురుభక్తి లేని వాళ్ళకి చదువు ఎలా వస్తుంది?" అన్నాను రోషంగా.

*** *** ***

ఆ తర్వాత ఆర్నెల్లకి మా యూనివర్శిటీలో ఒక పెద్ద స్కాండల్, బాంబ్‌లా పేలింది. కెమిస్ట్రీలో ఒక ప్రొఫెసర్ ఇద్దరు స్కాలర్స్ చేత పిహెచ్‌డి రీసెర్చి చేయించాడు. ఆ ప్రయోగాల్లో నైట్రిక్ యాసిడ్ ఎక్కువగా వాడారు. అద్భుతమైన రిజల్ట్స్ వచ్చాయి. థీసిస్సులు రాయడం, టైప్ చేయించడం, పై వాళ్ళకి పంపడం జరిగి పోయాయి. ఇక డిగ్రీలు వచ్చేస్తాయని అనుకుంటుండగా విద్యార్థులు లాబరేటరీలో జొరబడి సీసాల్లో ఇంకా మిగిలి వున్న 'ఏసిడ్'ని స్వాధీనం చేసుకున్నారు.

"ఒక గొప్ప ప్రదర్శన. నైట్రిక్ ఏసిడ్‌ని మంచి నీళ్ళలా తాగగల అద్భుతశక్తిని సాధించిన ఆశారావుచే" అని పబ్లిసిటీ ఇచ్చారు.

వందలాది విద్యార్థులతో కిక్కిరిసి వున్న అసెంబ్లీ హాల్లో ఆశారావు "అయ్యా నేను యోగిని కాను, మెజీషి

యన్ని కాను, మామూలు మనిషిని. ఈ ఏసిడ్ మన కెమిస్ట్రీ లేబరేటరీ లోది. తాగేస్తున్నా చూడండి!"అని రెండు గ్లాసుల్లోకి వంపుకొని తాగేశారు. జీ్రున తేన్చి ఓ సిగరెట్ వెలిగించి పొగతాగుతూ స్టేజి మీద డిస్కో డాన్స్ చేశాడు.

కెమిస్ట్రీ ప్రొఫెసర్ నిర్ఘాంతపోయాడు."ఈ బాటిల్ లోది కాన్సెన్ట్రేటెడ్ ఏసిడ్. రీసెర్చిలో వాడగా మిగిలింది. ఎలా తాగేశాడో... ఆ తెలిసింది. ఈ ఆశారావు... కులం వాడుగా... మనుషులకైతే ఏసిడ్ తాగితే ప్రమాదం కాని 'వాళ్ళకి' ఏం ప్రమాదం! దున్నపోతు మీద వాన కురిసినట్లు!"అన్నాడు పక్క వాళ్ళతో


వెనకనే వున్న కుచేల రావు చ్రున లేచాడు. "మేష్టారు! ఇక్కడ మీరన్న కులం లేదు కాని అలాంటి తేడానే వుంది. ఆశాగాడు తాగింది ప్యూర్ గోదావరి వాటర్. అంటే పవిత్ర గౌతమీ జలం..." అని తనూ ఆశారావు అర్నెల్ల క్రితం ఏసిడ్ సీసాలు లేబరేటరీ లోంచి దొంగిలించడం, ఆ ఏసిడ్ గోతిలో పారబోసి నీళ్ళతో వాటిని నింపి తిరిగి ఎవరూ చూడనప్పుడు లేబరేటరీలోకి చేర్చడం' వివరించాడు మైక్ ముందు నిలబడి.

"ఏసిడ్‌తో రావాల్సిన కెమికల్ రియాక్షన్స్ మంచి నీటితోనే వచ్చేశాయి ప్రొఫెసర్ గుండూరావు గారి సిద్ధహస్తాల్లో. ఇది ఎలాంటి అద్భుతమో తెలుసా? ఓ ఇల్లాలు పంచదార అనుకుని కాఫీలో టేబిల్ సాల్ట్ వేసిందట, అయినా ఆ కాఫీ తాగినప్పుడు తియ్యగానే వున్నట్లు!"

"ఇక్కడ మన ప్రొఫెసర్ గారు ఏసిడ్ అనుకుని నీళ్ళు వాడి రీసెర్చి చేశారు. మనలాంటి మామూలు మనుషులు అలా చేస్తే అనుకున్న ఫలితాలు రావు. కాని ఆయనకి వచ్చేశాయి. ఇది కేవలం ఒక అతీంద్రియ శక్తిగానే భావించాలి మనం. జై ప్రొఫెసర్ బాబాకీ, జై సద్గురు సైంటిస్టుకీ, జై మేజిక్ రీసెర్చికీ..."అని స్లోగన్స్ కొట్టాడు.

కొందరు ఉత్సాహవంతులైన విద్యార్థులు ప్రొఫెసర్ గుండూరావు చుట్టూ చేరి "జగదీశ చంద్ర హరే! జయ ఏసిడ్ స్వామి హరే! జయ జయ రెట్టింపు రీసెర్చి మిర్చి! నిష్ఠ గరిష్ఠ హరే... గుండూరావు, గుండూరావు, గుండూరావు, గుండూరావు, గుండూరావు సద్గురు ఓం... కులానంద కులరూప కులజ్యోతి కులహంస కుళ్ళు గుమ్మడి కాయా ఓం..." అని తాళం వేస్తూ గుండ్రంగా తిరుగుతూ కీర్తన పాడారు.

> మృత్యుంజయుణ్ణే
> మృత్యువు వదిలిపెట్టనట్లే
> సైన్సు యూనివర్సిటీని
> వదిలిపెట్టని కులపిచ్చి,
> మూఢనమ్మకాల కథ.




సైన్స్ యూనివర్సిటీకే అది మరవురాని అవమానం. మాయని మచ్చ.

అవమానంతో కందిపోయిన నూరు మంది అధ్యాపకుల మొహాలు నూరు కొరివి దెయ్యాల్లా వెలిగాయి.

నేను, శివానంద్ తరవాత కార్యక్రమానికి (దేహ శుద్ధి) భయపడి బయటకు జారుకున్నాం. వణుకుతున్న కాళ్ళతో ఎంత స్పీడు సాధ్యమో అంత స్పీడూ సాధించాం. వాగులు దాటి వంకలు దాటి సారంగధర మెట్ట దాటి ఒక నిర్జన ప్రదేశంలో చేరి అక్కడ బండరాళ్ళ మీద కూలపడ్డాం.

ముప్పై ఏళ్ళ క్రితం ప్రేరేప మృత్యుంజయుడు అనే కమ్యూనిస్టు నిరుణ్ణి అక్కడే కాల్చేశారుట.

అరగంట, అరేసి సిగరెట్లు కాలాకే...

"మేష్టారూ మృత్యుంజయుణ్ణే మృత్యువు స్పేర్ చెయ్యనట్లే సైన్సుని మూఢనమ్మకాలు స్పేర్ చేయడం లేదు. కాకపోతే సైన్స్ యూనివర్సిటీలో కులతత్వం ఏమిటి. వింతగా లేదూ!"

ఇద్దరం ఆ మాటలు విని ఉలిక్కి పడ్డాం.

చుట్టూ చూస్తే ఎవరూ కనపడలేదు.

"దెయ్యాలేమోరా. ఒకవేళ మృత్యుంజయుడి ఆత్మ ఇక్కడ తిరుగుతోందేమో. నీకు ఆంజనేయ దండకం వచ్చా!"శివానంద్ వణికాడు. వాడికి పోటీగా నేనూ వణికాను.

ఇంతలో రెండు బాదం కాయలు మా వీపుకి తగిలాయి. బాదం చెట్టు పైకి చూశాం.

కిల కిల మని ఆడనవ్వు, గాజుల గల గల వినిపించాయి.

"కామినీ దెయ్యం! రక్తం తాగేస్తుంది. అయ్యప్ప శరణం, శరణం అయ్యప్ప!"అంటూ పరుగెత్త బోతున్న శివానంద్‌కి ఆశారావు ఎదురొచ్చాడు.

"సైన్స్ చదివితే వచ్చిన శాస్త్రీయ దృక్పథం ఇదన్న మాట!"అంటూ సుజాత బాదం చెట్టు మీంచి దిగింది. వెనకాల మావయ్య దిగాడు. తుప్పల చాటున దాగిన కుచేలరావు కూడా నవ్వుతూ ఇవతలికొచ్చాడు.

"సైన్సు చదివితే వున్న మతి పోయిందట. ఆ మొహం ఏమిట్రా పై మేతలేందే పని చెయ్యలేని ఉద్యోగస్తుడిలా?"అన్నాడు మావయ్య.

"నీకు సైన్స్ బొత్తిగా రాదు మావయ్యా. నేను పదేళ్ళు రీసెర్చి చేసి పీహెచ్‌డి చేసి..."

"చదివిన మాత్రాన సంస్కార మబ్బదు! చదివి చదివి కూడ జడుడు కాడె! గుండె మెత్తదనమె గుర్తు సంస్కారికి! వాస్తవమ్ము నాల్గ వారి మాట!" ఆశారావు పద్యం చదివేశాడు.

కుచేలరావు ఆశ్చర్యపోయాడు. "నీకు ఒక పద్యం వచ్చునని నా కెప్పుడూ చెప్పేవు కావేంరా!"అన్నాడు. ఆశారావు వినయం నటించాడు.

"అందుకే మేష్టారూ! మీ పాఠాలు ఎంత తక్కువ వింటే అంత చదువు, సంస్కారం అబ్బుతాయని మేం క్లాసులు మానేస్తాం. బుద్ధుడు, జీసస్ లాంటి వాళ్ళ బొమ్మల్లో తలచుట్టూ తేజస్సు చక్రం వున్నట్లే మీ తలల చుట్టూ చీకటి చక్రం కనిపిస్తుంది మాకు" అన్నారు ఆశారావూ, కుచేలరావూ జంటగా.

"బావా, నాన్న మన పెళ్ళికి ఒప్పుకోనిదీ అందుకే. కాని అలా చేస్తే నువ్వు బాధపడతావని ఈ మేనరికాల సిద్ధాంతం తెచ్చాడుట. నువ్వు లెక్చరర్ ఉద్యోగం మానేసి సైకిల్ షాపు పెడితే వెంటనే మన పెళ్ళి చేసేస్తాడుట, ఓ పది సైకిళ్ళు కట్నం ఇచ్చి" అంది సుజాత.

●